అమ్మ తప్పు చేసింది!

శ్రీ మిక్కిలి సుందరరావు

ఆ వేళ ఊరిబయట కోలనులో మెల్లగా కదలుతున్న అలలమీద నాట్యం చేస్తూ నవ్వులు కురిపిస్తున్న తామర కన్యల వాలుచూపుల్లో చిక్కుపడిన సూర్యకాంతులు ప్రపంచాన్ని జాలిగా చూశాయి.

నది మీదుగా వీచే వసంత సమీరాలు సూర్యుని జాలిచూపులతో కలిసి మానవాళికి హాయిని చేకూర్చుతూ మందగమనంతో ముందుకు సాగిపోతూ సమస్తజీవుల ప్రశంసల నందుకుంటున్నాయి.

వాతావరణ ప్రశాంతతవలన పట్టణంలోని ప్రతి పనీ యెంతో వుత్సాహకరంగా కొనసాగిపోతూంది.

ప్రతివ్యక్తీ ఒకరికొకరు 'అబ్బ, యివ్వాళ యెంత హాయిగా వుందండి. యీ సంవత్సరానికి యివ్వాళే ననుకుంటాను యింతహాయిగా వుండడం' అని అనుకుంటున్నారు.

ఆ వేళ ఆఫీసు పనులన్నీ తృప్తికరంగా వున్నందు వలన ముకుందరావుగారు తన వామహస్తం మీద మెరిసిపడే ఖరీదుగల గడియారాన్ని ఒక్కసారి నిశ్చింతగా చూసుకుని కుర్చీమీద నుండి లేచి 'టేబుల్ బెల్' మ్రోగించాడు.

గణగణ మను శబ్దం విని, ఆఫీసు మూలని బీడి కాలుస్తున్న వెంకన్న చివరకుక్క తన కపాలం అంటుకునేంతగా లాగి, దాన్ని విసిరి దూరంగా వేసి, రెండంగల్లో ముకుందరావుగారి సమక్షంలో అతి వినయంగా నిలబడ్డాడు.

ముకుందరావుగారు అతని అమాయకత్వానికి తనలో నవ్వుకుని "వెంకన్నా, ప్రకాశరావుగారిని పిలువు" అన్నాడు.

మరుక్షణంలోనే ప్రకాశరావు వచ్చి ముకుందరావుగారికి నమస్కరించి నిలుచున్నాడు.

"ప్రకాశరావుగారూ, ఐదున్నరయ్యింది. ఇంకా గుమాస్తాలు యిళ్ళకు పోలేదు. వాళ్ళకు మాత్రం యిళ్లవద్ద పనులులేకుండా వుంటాయా? ప్రతిదినం వాళ్ళు ఖచ్చితంగా ఆఫీసు ఐదుగంటలకే వదిలేలాగ చూడు" అన్నాడు.

హెడ్ గుమాస్తా ప్రకాశరావు ఆయన మాటలు శ్రద్ధగా ఆలకించి "నేను వెళ్ళమంటున్నాను. కాని వాళ్లు పనికానిదే వెళ్లడంలేదు." అన్నాడు.

"ఎందుచేత?" అన్నాడు ముకుందరావు.

"మీరు యీ ఆఫీసుకు వచ్చినప్పటినుండి పనులు పూర్తిగా మారిపోయాయి. ప్రతి గుమాస్తాకు మీయెడల అభిమానం, గౌరవం యేర్పడ్డాయి. గుమాస్తాలంతా తమ పనిని ఎంతో ఓపికతోను సహనంతోను నిర్వర్తించుకుపోతున్నారు. దానికి కారణం మీరు వారియందు చూపుతున్న దయ, ప్రత్యేకమైన అభిమానం" అన్నాడు ప్రకాశరావు.

ముకుందరావుగారు ఒక్కసారితనమంచితనాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని నవ్వుతూ "అలాగా—" అన్నాడు.

"ఇదివరకు యీ ఆఫీసులోని పనులు చాలా విచిత్రంగా వుండేవి. ఎవరికైనా తమ పని యీ ఆఫీసు ద్వారా కావలసివస్తే, వాళ్ళు యిక్కడ కొన్ని రోజులు పడిగాపులు పడితేగాని ఆపని అయ్యేదికాదు. గుమాస్తాలు యెవరి కుర్చీలలో వాళ్ళు కూర్చొని, ఒక మూలకు తల ఆనించి యెదురు బల్లమీద కాళ్ళువేసి కునుకు తీసేవారు. మీవలన యీ ఆఫీసు అన్నివిధాలా అభివృద్ధి పొందిందనే చెప్పాలి—మాకే కాకుండా ప్రజలకు కూడా మీయెడల అభిమానము, గౌరవము యేర్పడ్డాయి." అన్నాడు ప్రకాశరావు.

"ప్రకాశరావుగారూ, పరులకు నీతులు చెప్పేకంటే తనకు తాను మంచిగా వుంటూ, తన బాధ్యత తాను నెరవేర్చగలిగితే యీ ప్రపంచమే బాగుపడుతుందంటాను. నేనుమాత్రం యితరులకు చేస్తున్న మేలు యేముందండి, నామీద అభిమానంకొద్దీ అలా అనుకుంటారు గాని—"

"అలా అనకండి. ఇంతకాలంనుండి యెంతోమంది ఆఫీసర్లను చూశాను. మీరు యువకులైనా, పెద్ద అనుభవం లేకపోయినా..."

"సరే నేను వస్తాను ప్రకాశరావుగారూ."

ముకుందరావుగారు ఆఫీసు ఆవరణ దాటేసరికి "బాబూ, పేదవాడికి ధర్మంచేసి పుణ్యం కట్టుకోండి" అంటున్న పేదవాడు కనుపించాడు.

సరియైనపోషణలేక సడలిపోయిన అతనిశరీరాన్ని అతని కన్నుల్లో కనుపించే దీనత్వాన్నీ చూసేసరికి ముకుందరావుగారి హృదయం జాలితో తడిసిపోయింది.

కాని తనజేబులో చిల్లరవున్నట్లు ఆయనకు జ్ఞాపకం లేదు. పోనీ చిల్లరకోసం జేబులో చెయ్యి పెట్టడం అతడు చూసి సంతోషపడవచ్చు, తరువాత చిల్లర లేదని చెప్పి అతనికి నిరాశకలిగించడం అంత భావ్యమైన పనికాదు. జేబులో తీరా చెయ్యి పెట్టిన తరువాత ధర్మంచెయ్యకపోవడం కూడా అంత భావ్యమైన పనికాదని, అనుకుంటూనే ఆయన కొంచెం ముందుకుసాగి, బజారులో అటునైపు మలుపు తిరిగి వస్తున్న ఒక స్త్రీని చూసి స్తంభించిపోయాడు. మళ్లీ పాలోచనగా చూసి తను మొదట అనుకున్న 'ఆమె' కాకపోవడంచేత కొంతవరకు సమాధానపడ్డాడు.

చాలా సేపటివరకూ ఆ బిచ్చగాని ఆకారమూ, ఆ స్త్రీని చూసినప్పుడు తనకు అకస్మాత్తుగా మనసులో మెరిసిన మరియొక స్త్రీ మూర్తి చిత్రము లీలగా తనయెదుట చాలా సేపటివరకు కనుపించాయి. ఈ రెండు సమస్యలనుగురించి అతడు చాలాసేపు మథనపడవలసివచ్చింది.

ముకుందరావుగారు ఆఫీసునుండి యింటికివచ్చే సరికి ప్రొద్దుపోయింది. ఇప్పటికి ఆయన మనసులో శాంతిభద్రతలు నెలకొన్నాయి.

ఇంటిముంగు పూలతోటలో మల్లెపందిరి ప్రక్క మలయపవనాలకోసం మంచం వేసుకుని కూర్చున్న విమలాదేవి, తెల్లనివెన్నెల్లో దేవతామూర్తివలె కన్నులు సారించి ఆయన రాకకు యెదురుతెన్నులు చూస్తోంది.

చల్లనిగాలులు హృదయాన్ని తాకి వుల్లాసాన్ని చేకూర్చే యీ అతినిర్మలమైన వాతావరణంలో ఆమె అందాన్ని, అంతకుమించిన ఆమె అనురాగాన్ని, నిత్యకృత్యాల్లో ఆమె తనకు చేస్తున్న సేవను ఒక్క సారి జ్ఞప్తికితెచ్చుకు నేసరికి తన హృదయంలో వివరించలేనంత ఆప్యాయత జనించింది.

ఆయన ఆమెను తాకేటంత దగ్గరకు సమీపించే సరికి ఆమె సిగ్గుతో తలవంచుకుంది. ఆయన అలాగే ఆమెప్రక్కగా మరీదగ్గరగా కూర్చుని చిన్నగా సన్నగా నవ్వాడు.

గాలికి వూగుతున్న కొబ్బరియాకుల సందుల గుండా వచ్చి పడుతున్న పున్నమి వెన్నెల ఆమె ముఖారవిందాన్ని రాగరంజితం చేస్తూ వింతశోభల్ని కూర్చుతున్నది.

తదేకదీక్షగా చూస్తున్న ముకుందరావుగారు తన చిటికినవ్రేలితో ఆమె చెక్కిలినిమీటి, ఆ చెక్కిలి మీదుగా ప్రవహిస్తున్న సిగ్గుతెరలను చెల్లా చెదురు చేద్దామని ప్రయత్నించాడు. కాని ఆయన్ని ఆమె వారించగలిగింది.

"చూడండి, పాపాయి నిద్రనుండి లేస్తాడు మీ అల్లరికి—ఇక వాడి అల్లరివల్ల మీ స్నానానికి భోజనానికి ఆటంకం వాటిల్లుతుంది." అన్నది విమలాదేవి.

"ఈ మంచులో వాడిని నిద్రపుచ్చావు, జలుబు చేస్తుందేమో."

"పగలంతా యెంత చెప్పినా నిద్రపోకుండా అల్లరి చేస్తాడు. ఇలా వెన్నెట్లోకి తీసుకొచ్చి చిన్న కథ చెప్పేసరికి నిద్రపోయాడు."

"మంచు కురుస్తుంది వాడిని లోనికి తీసుకువెళ్దాం పద" అన్నాడు.

"మరచిపోయాను. టెలిగ్రాం వచ్చింది, ప్రమాదంగా వుందిట!" అన్నది.

"ఆఁ—! టెలిగ్రాం వచ్చిందా? ఎక్కడి నుండి?" అన్నాడు ముకుందరావు.

"ఎవరో వనజాక్షిట" అనేసింది విమలాదేవి.

ముకుందరావు నిర్ఘాంతపోయాడు!

వెన్నెలకాంతికి మబ్బు తునకలు అడ్డు తగిలాయి. మసక చీకటిలాగా ప్రదేశం మారిపోయింది.

"ఎవరండీ యీమె? నాకు యెప్పుడూ చెప్పారు కాదు?" అని ముభావంగా అడిగింది విమలాదేవి.

విమలాదేవికి ఆమెనుగురించి చెప్పకపోవడం సహించరాని విషయమేననిపిస్తుంది. తన గౌరవాన్ని కాపాడుకోవడానికి తన అంతస్థు నిలబెట్టుకోవడానికి ఆమెకు యీ రహస్యాన్ని తను చెప్పలేకపోయాడు. ఈనాడు ఆమెకు ప్రమాదం సంభవించడానికికూడా ఒక విధంగా కారణం తనేనేమోననిపించింది. వెంటనే అతనికి షుమారు పదిహేనేళ్ళనాటి విషాద సంఘటన మళ్ళీ ఒక్కసారి కండ్లకు కట్టినట్లయ్యింది.

*　　*　　*　　*

ఆ పట్టణంలోని మారుమూలనువున్న ఒక మురికిపేటలోనికి కలరా జొరబడింది. ఇటువంటి మురికిపేటల్లోకి యే వ్యాధి ప్రవేశించినా తన కసి తీర్చుకుంటుంది. ఎంతోమంది గంటలమీద ప్రాణం వదిలారు. ముక్కు పచ్చలారని పదేళ్ళ ముకుందరావు కూడా తన తల్లిదండ్రులను కోల్పోయాడు. అతని తల్లి కడసారిగా కన్నీళ్ళువిడుస్తూ "పసివాడివి. దిక్కులేనివాడివి. యెలా బ్రతుకుతావుబాబూ..." అంటూ కళ్ళు మూసింది. తల్లి, తండ్రిపోయినతరువాత ముకుందరావుకు ఆ యింట్లో మిగిలింది కన్నీళ్ళే!

నాలుగునెలల అద్దె యెలా చెల్లించాలి? ఈ పచ్చి మంచినీళ్ళు త్రాగి యెలా బ్రతకాలి? యెన్నాళ్ళు యిలా రోజుల్ని తింటూ కన్నీళ్ళు త్రాగాలి? అనే సమస్యలతో అతని పసిహృదయం కుమిలిపోయింది.

అద్దె యజమానివచ్చి యింటికి తాళం వేస్తుంటే ముకుందరావు ఆ యిల్లు మారుమ్రోగేటట్లు దుఃఖిం

చాడు. తల్లిదండ్రుల పాదాలవద్ద కూర్చుని తను తీయించుకున్న ఫోటోకూడా తీసుకెళ్ళే భాగ్యం అతనికి దక్కలేదు!

బజారుపట్టుకుని ముందుకు సాగుతుంటే జీవితానికి దారికానరాక ధారగా కారుతున్న కన్నీళ్లు అతని మురికిచొక్కాయిని ముద్దచేశాయి! నీళ్లు కడుపునిండా త్రాగిన నల్లని మబ్బులు నింగిలో త్రేణ్పుతున్నాయి. వాటి అరుపులు అతని గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఏడయగల తండ్రి చల్లనిపాదాలను తన కన్నీటితో కడగాలో—యే చిన్నయిల్లాలి సన్నిధిలో పసిపిల్లవాడిలా ప్రాధేయపడాలో అర్థంకాకుండా వుంది.

ఆకాశంలోని కారుమబ్బులు అటూయిటూ పరుగులిడుతున్నయ్. గాలి అతిజాలిగా యేడుస్తుంది. పటణం చీకటిముసుగు వేసుకుందని అతని కింకా గుర్తుకేరాలేదు! పట్టణమంతా తిరిగి తిరిగి యిప్పుడు యే వీధిలో కొచ్చాడో తనకే తెలియకుండావుంది. చిన్న వానజల్లు చలిగాలితో కలిసి ముళ్ళుగుచ్చుకున్నట్లు రాలుతుంది. ఎక్కడ తలదాచుకోవాలో అతనికి అర్థంకాలేదు. బజారుప్రక్క వున్న ఒక డాబాలోని పంచ నిర్మానుష్యంగా కనుపించింది. మెల్లగా మెట్లెక్కి వరండాలోనికి వెళ్ళి పంచలోని ఒకమూలకు కదలకుండా ఒదిగి కూర్చున్నాడు.

ఆ యింటికి తలుపు వేసివుంది. రెక్కలు మూసుకున్న కిటికీలోనుండి వచ్చే సన్నని కాంతి అతని ప్రక్క సన్ననిగీతగా పరుచుకుంది. ఇంటికామందులు లోపల వెచ్చగా హాయిగా నిద్రపోతున్నారు కాబోలు అనుకున్నాడు ముకుందరావు.

వర్షం రెక్కలువిప్పుకుని విహారం చేస్తుంది. చలిగాలి రివ్వన దూసుకువస్తుంటే, అతని నరాలు జివ్వుమంటున్నాయి. శరీరం గజగజలాడసాగింది. అతనిక్రింది పెదవి, పైపెదవిని వత్తిడిచేస్తుంది. క్రిందపెదవిమీద అతనికి కోపం వచ్చింది. కాని వాటిమీద కసితీర్చుకునే శక్తి అతనికి లేకపోయింది. ఒకవైపున నిద్ర రెప్పల్ని తన్నుతుంది. తలుపులు కిర్రుమనగానే అతని కనురెప్పలు విప్పారాయి. కొంతసేపటికి బయటికివచ్చిన భారీ మనిషిని చూసి అతనికి భయమేసింది. మూటకట్టినట్లు మూలకు ముడుచుకుపోయాడు. అతని రాకవల్ల ముకుందరావు కేదో సుగంధ పరిమళం వీచినట్లయ్యింది.

"రేయ్, యెవడ్రా, ఆమూలని?" అని అన్నాడు.

అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఏం సమాధానం చెప్పాలో అర్థంకాలేదు.

"ఏయ్, యిదుగో, యీ మూలని యెవడోవున్నట్లున్నాడు. వచ్చిచూడు" అని లోపల యెవరినో పిలిచి అతడు గొడుగు వేసుకొని వెళ్ళిపోయాడు.

కొంచెం సేపటికి యెవరో వస్తున్న గజ్జెలధ్వని వినిపించింది. ఆ అడుగులు సంగీతపు సరిగమల్లాగ పడుతున్నాయి. వరండాలోని విద్యుద్దీపం మేల్కొంది. ముకుందరావుకు ఎక్కడాలేని భయమేసింది. ఆమె గుమ్మంవద్ద నిలబడి ముఖారవిందం ముందుకుసారించి అతన్ని చూసింది. వెంటనే బయటికి వచ్చేసరికి 'గప్పు'మని ఒక వింతసువాసన అతని నాసికా రంధ్రాల్లోకి చొచ్చుకుపోయింది.

లేతగులాబిరంగువంటి ఆమె శరీరఛాయను, సుకుమారమైన ఆమె అవయవాలను అంటిపెట్టుకొని వున్న ఆకుపచ్చని సిల్కుచీరను, కోపావేశాలకు తావులేని నిష్కళంకమైన ఆమె ముఖారవిందాన్ని, మల్లెపూలుతింటూ పారాడుతున్న ఆమె పొడవైన జడనూ పరికిస్తే ఆమె చదువూ సంస్కారమూ కలిగిన స్త్రీయని చెప్పవచ్చు.

వర్షం ఒక భీకర స్వరూపాన్ని పొందుతుందనే సూచనగా ఆకాశంలో రెండుమబ్బులు యుద్ధానికి తలపడ్డాయి. అందువలన ఉరుములు మెరుపులతో కూడిన పిడుగులు పడుతున్నాయి. చలిగాలి అతని రొమ్ములో జొరబడి రొద పెడుతుంది.

"అబ్బాయ్, ఎవరునీవు?" ఆమెకంఠం తియ్యగావుంది. అతనికి యేం చెప్పాలో అర్థంకాలేదు. ఆమె చాలాసేపు అతని వాలకాన్ని పరికించింది. ఇంట్లోనుంచి పరుగుత్తుకొచ్చిన 'టామీ' అరుచుకుంటూ అతనిమీదకు దూకింది. ఆమె టామీని గద్దించింది. ముకుందరావుకు క్రొత్త ఆలోచనవచ్చింది. రైలుస్టేషనులో పడుకోవచ్చునని బయలుదేరాడు.

మెట్లు దిగిపోతున్న అతన్ని "అబ్బాయ్, ఒక్కమాట- యిలా రా" అని ఆమె పిలిచింది.

అతడు వెనక్కితిరిగి మెట్లెక్కి వరండాలో కొచ్చాడు.

"ఈ అర్ధరాత్రివేళ యిక్కడెందుకున్నావ్?" అనిఆమె ప్రశ్నించింది.

"ఎక్కడా చోటుదొరకలేదు. యిక్కడ దొరికింది" అన్నాడు దీనంగా-

"అయ్యో, నీకు మాయింట్లో చోటుదొరికిందా?" అన్నది.

ముకుందరావు మాటలు రాలేదు.

"మీ యిల్లెక్కడ?" ఆమె ప్రశ్నించింది.

"నాకు యిల్లులేదండి?" అన్నాడు. అతనికి కన్నీరు రాసాగింది. ఆమె ఆశ్చర్యపోయింది.

"అయ్యోరామ, నీకు తల్లి, దండ్రీవున్నారా?"

అతనికి ఆమె మాటల్లో కొంత ఆదరణ కనుపించింది.

అతని విషాదగాథను ఆమె జాలిగా ఆలకించింది.

ఆమె చూపులు అతని కళ్లలోకి జాలిగా చూశాయి.

అతని కన్నీళ్లు ఆమె చీరకొంగుతో తుడిచింది. అతన్ని ఆప్యాయంగా బుజ్జగించింది.

"దేవుడు గొప్పవాడు బాబూ, నేడు నాకు దిక్కు చూపించాడు" అన్నది. దేవుడు తనని కనికరించాడనుకున్నాడు ముకుందరావు. ఆమె అతన్ని యింటిలోనికి తీసుకువెళ్లింది. ఇల్లు చాలా వింతగా కనుపించిందతనికి—ఇంట్లో సువిశాలమైన నాలుగు గదులున్నాయి. ఒకగదిలోని పందిరి మంచంమీదవున్న నలిగిన మల్లిపూరేకులు మంచివాసన వెదజల్లుతున్నాయి. నవీనమైన పద్ధతిలో చేయబడిన ఒక బల్లమీద రేడియోవుంది. ఒకవైపున వీణవుంది. చక్కని అద్దాలబీరువాలు రెండున్నాయి.

గుమ్మాలకుపైన గోడమీదవున్న చిత్రాలలో రాధాకృష్ణుల దరహాసాలు, తారాశశాంకుల పరిహాసాలు లీలగా కన్పిస్తున్నాయి. ఇందొకగదిలో పూజావిగ్రహం వుంది!

ఆమె అతన్ని వేన్నీళ్లతో స్నానంచేయించి, బట్టలు విడిపించి ఒక పెద్ద తుండుగుడ్డ చుట్టుకోవడాకి యిచ్చింది. వంటగదిలో అతనికి భోజనంపెట్టింది. అనుకోనిరీతిగా వర్షం గాలివానగా మారిపోయింది. చలిబాధ తీవ్రరూపం దాల్చింది.

ఆ రాత్రి ఆమెఒడిలో నిశ్చింతగా అతడు నిద్రపోయాడు. అతడు ఆమెఒడిలో పడుకున్నప్పుడు తన తల్లి ఒడిలో పడుకున్నప్పుడు కలిగే నిరంతరానందాన్ని పొందగలిగాడు.

మరుక్షణంనుండి అతని జీవితంచిగురించ నారంభించింది. క్రొత్తబట్టలు! క్రొత్తజోళ్లు! క్రొత్త పుస్తకాలు!! అంతా క్రొత్తగానే కనుపించసాగింది.

అతడు బడినుండి తిరిగివచ్చేసరికి ఆమె భోజనంతోపాటు అనేకమైన వంటలు తయారుచేసేది. బడినుండి రాగానే అతని లేతబుగ్గల్ని ముద్దుపెట్టుకుని, కౌగిటో అతన్ని దాచేసుకుని అరమూతలు వేసేది. 'నా బాబు, నా కన్నతండ్రి' అనుకునేది. ముకుందరావుకు ఆమెయెడల భక్తి, గౌరవము యేర్పడ్డాయి.

కొంతకాలానికి అతన్ని చదువుకోసం యింకొక పట్టణం పంపింది. అక్కడ అతన్ని ఒక హాస్టల్లోచేర్పించింది. అతనికి యెంత డబ్బు కావలసి వచ్చినా, వుత్తరము ముట్టగానే పంపించేది. అతనివద్దకు తరుచు వెళ్లి చూసివచ్చేది. కాని సెలవులకు కూడా అతన్ని ఇంటికి రావద్దని లేఖరువ్రాసేది.

కొంత కాలానికి—

అతడు ఒక మానవుడుగా తయారయ్యాడు. ఆమె అతని లేతహృదయానికి రంగులుపోసి వంపులు దిద్దింది. అతడు బి. ఎ. చదువుకున్న తరువాత ఆమెను గురించి తెలుసుకోవాలని కుతూహలపడ్డాడు. ఆమె యెవరు? ఏమిటి? అనే ప్రశ్నలు అతనికి వచ్చాయి. అయినా వాటిని తెలుసుకోన వలసిన అవసరం కూడా అతనికి కలుగలేదు.

ఒకనాడు ఆమెను చూడాలని ప్రత్యేకముగా బయలుదేరి వెళ్లాడు.

ఆనాడు—

ఆ యింట్లో చూసిన దృశ్యం అతని గుండెలు బ్రద్దలు చేసింది. ఆ దృశ్యమే తీరని దారుణ పరిణామాలకు దారితీసింది.

ఆ రాత్రి అతడు పూజాగృహంలో పడుకున్నాడు. గది చీకటిగానే వుందికాని అతనికి నిద్రపట్టలేదు.

కొంతసేపటికి యెవరో తలుపుతట్టిన శబ్దం అతనికి వినిపించింది. వెంటనే సంభాషణలు వినిపించసాగాయి.

"ఇవాళ లాభంలేదు. మా అబ్బాయి వచ్చాడు." అని ఆమె అన్నది.

"అరెరె...వంద రూపాయలు తెచ్చాను. నామీద ఒట్టు." అతడు బొంగురుగొంతుతో చకచకా మాటాడుతూనే వున్నాడు.

"హుష్...అబ్బ!...దయచేసి యివాళ్టికి వెళ్ళిపొండి. మీకు పుణ్యముంటుంది." ఆమె అతన్ని బ్రతిమాలింది.

అతడి మాటలు తడబడుతున్నాయి.

"ఈ స్వర్గంలోనుండి మళ్ళీ నరకంలోనికి వెళ్లేదా?"

"నా మాట విని వెళ్లండి."

"యె...యెలా వెళ్లేది? నువ్వే-చే-చెప్పు," అతడు ఒకవైపు వెక్కిళ్ళు వెక్కుతూ లీవిగా మాట్లాడుతున్నాడు.

"ఛీ, పాడుకంపు, త్రాగివచ్చావనుకుంటాను." ఆమె అసహ్యించుకున్నది.

"ఇది...పా...పాడుకంపా? ఎవడన్నాడో...చె...చెప్పు...వాణ్ణి మర్డర్ చేస్తాను" అంటున్నాడు.

"..........."

అతడు—

"హుఁ—హుఁ—సారాయినిషా లేకపోతే...' అంటుండగానే ఆమె ఒక్క లెంపకాయి లాగికొట్టింది కాబోలు 'చెళ్ళు'మనే శబ్దం అతనికి పెద్దగా విన్పించింది.

అమ్మ తప్పు చేసింది!

"ముందు నాయింట్లో నుండి బయటికిపో—" అని ఆమె అతణ్ణి బయటికినెట్టి తలుపు వేసుకుంది. ముకుందరావు యిది గమనించాడేమోనని ఆమె హృదయంలో ఆవేదన రేగింది!

ముకుందరావుకి తల తిరిగినట్లయ్యింది. ఆమె శీలాన్ని అమ్ముకునే స్త్రీ అని అతనికి ప్రత్యక్షంగా తెలిసిపోయింది. పశుప్రవృత్తితో బ్రతికే అబలఅని అర్థమయ్యింది. ఇక యీ నరకకూపంలో అతడు ఒక్క క్షణంకూడా నిలువలేకపోయాడు. ఒక్క అణుబాంబు పడిన సస్యశ్యామలమైన భూమి యెడారిగా మారినట్లు అతని హృదయంలో ఆమెపైనున్న భక్తి దహించుకుపోయింది. ఒక వేశ్య చేతిలో పెరిగి పెద్దవాడినయ్యాననే ఆవేదన అతన్ని పీడించింది. వెంటనే యీయిల్లు శాశ్వతంగా విడిచిపోవాలని నిర్ణయించుకున్నాడు. పూజాగృహంనుండి ఆమె గదిలోనికివెళ్లి బయటతలుపు తీశాడు.

అతడు వెళ్లిపోతున్నాడని గ్రహించి ఆమె హృదయం కృంగిపోయింది. గుండెల్లో అగ్నిజ్వాలలు బయలుదేరాయి. ఆమె చివాలున లేచి 'బాబూ'! అనుకుంటూవచ్చి అతని పాదాలమీద వాలిపోయింది.

అతడు శిలావిగ్రహంలాగ స్తంభించిపోయాడు.

"బాబూ...నన్ను విడిచి వెళ్లిపోతావా? చిన్ననాటినుండి నీవేదిక్కని యెంతో గారాబంగా పెంచుకున్నాను. ఈలోకంలో నీవుతప్ప నాకు వేరే దిక్కు లేదు. ఇటువంటి పని యిక యెన్నటికీ చెయ్యను."

ఆమె దీనస్థితిచూసి అతని కనుకొలకుల్లో రెండు కన్నీటిచుక్కలు నిలిచాయి.

"బాబూ, పాపాత్మురాలిని! నన్ను విడిచి వెళ్తావా బాబూ? నాకన్నతండ్రి, నీవు నన్ను విడిచి వెళ్లితే నేను తిండి తినకుండా యిలాగే మరణిస్తాను... ఇక నాజన్మలో యిటువంటిపని చెయ్యను" ఆమె దుఃఖాన్ని అతని హృదయం భరించలేకుండా వుంది. ఆమె కన్నీళ్ళతో అతని పాదాలు తడిసిపోయాయి. అయినా అతని అంతఃప్రవృత్తి బలవంతంగా బయటికి నెట్టివేస్తూంది.

ఆమె హస్తాల్లో చిక్కుపడిన పాదాలను అతడు బలవంతంగా పెకలించి లాక్కున్నాడు. ఆమెగుమ్మం మీదపడి భోరున దుఃఖిస్తూ తన రెండు హస్తాలను జోడించింది. అతని కనుకొలకుల్లో నిలిచిన రెండు కన్నీటి బిందువులు ఆమె దోసిటిలో రాలాయి! ముకుందరావు కదిలిపోయాడు.

వెంటనే వుద్యోగం సంపాదించుకోగలిగాడు. కొంతకాలానికి వివాహం చేసుకున్నాడు. రోజులు కలిసివచ్చి ఒక ఆఫీసరుగా నియమింపబడ్డాడు.

అతని వివాహంనాడు ఆమె లేకపోయినందుకు ఒకవిధమైన విషాదచ్ఛాయలు అతనిలో మిగిలిపోయాయి!

ఈనాడు వచ్చిన టెలిగ్రాం అతనిలో తుఫాను లేపింది. ఆమెకు ద్రోహంచేసిన నేరస్థుడులాగ అతడు బాధపడ్డాడు.

అంత మహాపట్టణంలో యెవ్వరూ కనికరించకపోయినా ఆమె కనికరించి కాపాడింది. తన స్వంత బిడ్డలాగా ఆదరించింది. ఆమె నిజంగా ఒక మాతృస్త్రీ కాకపోవచ్చుకాని ఆమెలో ఉత్తమ మాతకుండవలసిన గుణాలు గూళ్ళుకట్టుకుని వున్నాయి. తమలో మాతృత్వం వుందనుకునే అనేకమంది స్త్రీలలో కూడా యిలాంటి వుత్తమ గుణాలు కనుపించవు.

ఆమె కనికరించక పోతే తను యేమయ్యేవాడు? ఏ రైలు స్టేషన్లో మూటలు మోసేవాడో! ఏ కాఫీ హోటల్లో కప్పులు కడిగేవాడో! ఏ సినిమాహాల్లో, సిగరెట్లు అమ్మేవాడో!

ఆమె తనమీద అపారమైన ప్రేమ చూపింది. తన జీవితానికి వెలుగుబాట చూపించింది. తన యందున్న ప్రేమవల్ల పశుప్రవృత్తి మానుకుంటానని కన్నీరు కార్చింది. ఈనాడు తను ఒక ఆఫీసరు కాగలిగాడంటే కేవలం ఆమె దయవల్లనే!

ఆమె చేసింది తప్పుకాదు! ఆమె యీ లోకానికి ఒక వేశ్య కావచ్చు. కాని తనకుమాత్రం ఆమె అమ్మతో సమానం! తన మాతృస్థానాన్ని ఆమె ఆక్రమించుకున్న పవిత్రురాలు!

ఇంకా ఆలోచిస్తే అమ్మచేసింది తప్పుకాదు. ఆమె పరిస్థితులు అలాంటివి! దేశంలో ఆర్థిక బాధలకు లోబడే కొంతమంది నిర్భాగ్యులవలెనే ఆమె కూడా మారిపోయింది.

అతని ఆలోచనకు విమలాదేవి అడ్డువచ్చింది.

"ఏమిటండీ, మీలో మీరే ఆలోచించుకుంటారు? వనజాక్షి యెవరో చెప్పరా?" అన్నది దినంగా—

"ఎవరో కాదు విమలా—ఆమె మా అమ్మ!" అన్నాడు ముకుందరావు ఆనందంగా—

"ఆఁ—మీ అమ్మ! మీకొక అమ్మ వున్నదని నాతో యెప్పుడూ చెప్పలేదేమండి?" అన్నది విమలాదేవి ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ—

"తరువాత అంతా చెబుతాను. ముందు అన్నీ సర్దు. బయలుదేరుదాం" అన్నాడు.

తెల్లని చందమామను నల్లని మబ్బులు కప్పివేస్తున్నాయి. చీకటి, వెన్నెల తెరలుతెరలుగా భూమిమీద పరుచుకుపోతున్నాయి!